మేనల్లుడు ఆదిత్యకు కేటీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్ మే 20 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని ప్రఖ్యాతిగాంచిన వేక్ ఫారెస్ట్ యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్న తన మేనల్లుడు, ఎమ్మెల్సీ కవిత పెద్ద కుమారుడు ఆదిత్యకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆదిత్య డిగ్రీ పట్టా సాధించి తమ కుటుంబం గర్వపడేలా చేశారని మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎన్ని కేసులు పెట్టినా పోరాటం ఆగదు

బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 20 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేయాలని నిలదీసినందుకు రేవంత్ సర్కార్ అక్రమ కేసులు పెడుతున్నదని, ఎన్ని కేసులు పెట్టిన ప్రజల పక్షాన పోరాటం మాత్రం ఆగదని బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య స్పష్టంచేశారు. ప్రభుత్వ హామీలను ప్రశ్నించినందుకు తనపై అక్రమ కేసులు బనాయించిన తరుణంలో మంగళవారం బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ పోలీసుల ఎదుట బీఆర్ఎస్ లీగల్ సెల్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు ఇస్తానన్న నిరుద్యోగ భృతి, యువ భరోసా కార్డు, రెండు లక్షల ఉద్యోగాలు, ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు, పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ఎక్కడ? అని నిలదీశారు. మహిళలకు ఇస్తానన్న రూ.2500 మహిళా భరోసా, పింఛన్ల పెంపు, వరి ధాన్యానికి బోనస్, రైతుభరోసా గురించి అడిగితే కేసులు పెడ్తరా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో నిర్బంధించినా తమ పోరాటం ఆగదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అడ్వకేట్ జక్కుల లక్ష్మణ్ మాట్లాడుతూ.. విచారణ చేయకుండా తప్పులను ప్రశ్నించే విద్యార్థులపై 352-యాక్ట్ ప్రయోగించరాదని సుప్రీం కోర్టు తీర్పు ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కడం దుర్మార్గమని పేర్కొన్నారు.

సంస్కృతిని కాపాడుకోవాలి

కమల్ చంద్రభంజ్ దేవ్ కాకతీయ

హనుమకొండ, మే 20 : మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కాకతీయుల 22వ వా రసుడు మహారాజ్ కమల్‌చంద్ర భంజ్‌దేవ్ కాకతీయ సూచించారు. మంగళవారం ఓరుగల్లు పర్యటనలో భాగంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌తో కలిసి భద్రకాళీ అమ్మవారిని దర్శించుకొన్నారు. అనంతరం పోచమ్మమైదాన్ సెంటర్‌లోని రాణీరుద్రమదేవి విగ్రహానికి నివాళులర్పించారు. ఖిలావరంగల్ కోటలోని శంభులింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయ రుద్రేశ్వరునికి అభిషేకాలు చేశారు. టూర్స్ వ్యవస్థాపకుడు అరవింద్ ఇంటికి వెళ్లి, హనుమకొండ నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో ఓరుగల్లు ప్రజలతో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

29మంది అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్

- **గోవిందనామాలను వక్రీకరించడంపై సీరియస్**
- **టీటీడీ పాలకమండలిలో పలు కీలక నిర్ణయాలు**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లోని 29మంది అన్యమత ఉద్యోగులకు వీఆర్ఎస్ ఇచ్చి పంపాలని పాలకమండలి నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. వీఆర్ఎస్‌కు ఉద్యోగులు అంగీకరిస్తే.. రిటైర్డ్ బెనిఫిట్స్‌తోపాటు అదనంగా రూ.5 లక్షలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. మంగళవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తిరమలలో పాలకమండలి సమావేశం నిర్వహించారు. శ్యామలరావు మీడియాతో మాట్లాడుతూ.. స్విమ్స్ ద్వారా మరిన్ని వైద్య సేవలు అందించాలని నిర్ణయించినట్టు తెలిపారు. శ్రీవారి ఆలయ భద్రత దృష్ట్యా యాంటి డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తామని తెలిపారు. గోవిందనామాలను వక్రీకరిస్తూ.. ఓ తమిళ సినిమాలో పాటను రూపొందించారని, ఆ టీమ్‌కు లీగల్ నోటీసులు జారీ చేయనున్నట్టు వెల్లడించారు. తులాభారం వివాదంపై విజిలెన్స్ విచారణ మొదలైందన్నారు.

అందాలభామల వెంట మంత్రుల పరుగులు

- **సమస్యలను పట్టించుకోకుండా సొల్లుకారుస్తూ తిరుగుతున్నరు**
- **ఉగ్రవాదులా? మావోయిస్టులా? ఎవరు ప్రమాదకరమో చెప్పాలి**
- **సీపీఐ నేత నారాయణ ధ్వజం**
- **రాష్ట్రంలో పాత పథకాల సంగతేంది: కూనంనేని**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరమంతా ఇప్పుడు అందాలభామల చుట్టూ తిరుగుతున్నదని, ఆ భామల వెనకాల మంత్రులు సొల్లు కార్చుకుంటూ తిరుగుతున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ ఎద్దేవా చేశారు. పాలనను, ప్రజా సమస్యలను పక్కనపెట్టి అందాలభామల కోసం రూ.కోట్లల్లో ఖర్చుపెట్టేది సొల్లు కార్చుకోవడానికా? అని ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ దేశానికి ఉగ్రవాదులా.. మావోయిస్టులా.. ఎవరు ప్రమాదకరమో కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదంపై చర్చలకు సిద్ధమైన కేంద్రం.. ఈ దేశ పౌరులైన మావోయిస్టులతో చర్చలపై స్పందించకపోవడం ఏమిటని నిలదీశారు. మన దేశానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిఫాక్టో ప్రధానిగా వ్యవహరిస్తుంటే, ప్రధాని మోదీ డమ్మీ ప్రధానిగా మారిపోయారని ఎద్దేవా చేశారు. ట్రంప్ మన దేశ పాలసీలను నిర్దేశిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను శాసించే ప్రయత్నం చేస్తుంటే దానిని అడ్డుకోవాల్సిన ప్రధాని మోదీ మౌనం వహిస్తుండటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ట్రంప్ ఆదేశాలను ప్రధాని మోదీ పాటించడం దేశానికే అవమానకరమని మండిపడ్డారు. టెర్రరిస్టులకు వ్యతిరేకంగా దేశం మొత్తం మద్దతు తెలిపితే.. మోదీ మాత్రం ట్రంప్‌కు జై కొట్టి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని, ఇదేనా మీ దేశభక్తి? అని ప్రశ్నించారు. దేశం కోసం సర్వశక్తులు ఒడ్డి పోరాడుతున్న సైనికులను అవమానపర్చేవిధంగా మాట్లాడిన కేంద్ర మంత్రిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుపై స్పష్టత ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. గత ఏడాదిన్నరగా పాత పథకాలను అరకొరగా అమలుచేస్తుండటంతో ప్రజల్లో గందరగోళ పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నదంటూనే కొత్త పథకాలు పెడుతున్నారని, వీటి అమలుకు ఎక్కడినుంచి డబ్బులు తెస్తున్నారో స్పష్టం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఎంతమంది మావోయిస్టులను చంపివేశారు? మరెంతమందిని చంపుతారు? అని కేంద్రాన్ని ప్రశ్నించారు. అసలు కేంద్ర ప్రభు త్వం లక్ష్యం ఏమిటో శ్వేతప్రతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌లో కేంద్ర బలగాలతో కలిసి రాష్ట్ర పోలీసులు సైతం పాల్గొంటున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని ప్రకటించాలని కోరారు.

కల్వకుంట్ల హిమాన్షు, అతని స్నేహితులకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న హిమాన్షు

వేదాశీర్వచనం చేసిన అర్చకులు

యాదగిరిగుట్ట, మే 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనుమడు, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కుమారుడు కల్వకుంట్ల హిమాన్షు మిత్రులతో కలిసి దర్శించుకున్నారు. హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా మంగళవారం స్వామివారి కొండకు చేరుకున్నారు. మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి స్వయంభూ పంచనారసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. అనంతరం యాదగిరిగుట్ట ఆలయ నిర్మాణం, కృష్ణశిలలు, టెంపుల్ సిటీని పరిశీలించి తరించారు.

ఆత్మాహుతికి సిద్ధమైన సమీర్, సిరాజ్!

- **దేశవ్యాప్తంగా పేలుళ్లకు ప్రణాళిక**
- **సిగ్నల్ యాప్ ద్వారా సంభాషణలు**
- **ఎన్ఐఏకు చేరిన ఉగ్ర కుట్ర కేసు**

సిరాజ్ ఉర్ రెహ్మాన్

సయ్యద్ సమీర్

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా భారీ పేలుళ్లకు కుట్ర చేసి న విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్ ప్రాణత్యాగానికి సైతం సిద్ధమైనట్టు విజయనగరం పోలీసులు గుర్తించారు. జనసమ్మర్థం ఎక్కువగా ఉన్న చోట ఆత్మాహుతి దాడులకు వీరిద్దరు ప్లాన్ చేసినట్టు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నట్టు తెలిసింది. సిరాజ్ తండ్రి విజయనగరం రూరల్ స్టేషన్‌లో ఏఎస్సైగా, తమ్ముడు ఎస్డీఎఫ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. సిరాజ్ 2017లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి విజయనగరం జిల్లా కొత్తవలసలోని ఒక కం పెనీలో నాలుగు నెలలు పనిచేశాడు. ఆ తర్వా త హైదరాబాద్‌లో ఎస్సై సెలక్షన్స్ శిక్షణ కోసం వచ్చి.. 2018, 2022లో రెండుసార్లు విఫలమయ్యాడు. గ్రూప్-1 కోసం శిక్షణ తీసుకుని 2019, 2024లో రెండుసార్లు ప్రయత్నం చేసినా సెలెక్ట్ కాలేదు. దీంతో 2024 ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు '108'లో టెలికాలర్ గా పనిచేశాడు. హైదరాబాద్ బోయగూడకు చెందిన సయ్యద్ సమీర్ ద్వారా వరంగల్‌కు చెందిన పరహాన్ మొయినుద్దీన్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన బాదర్‌తో పరిచయాలు పెరిగినట్టు పోలీసులు పేర్కొన్నారు.

సిగ్నల్ యాప్ నుంచే చర్చలు, చాటింగ్‌లు..

వీరు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న సిగ్నల్ గ్రూపులలో 'ఖిలావత్, జిహాదీ' అంశాలపై చర్చించుకునేవారని పోలీసులు తేల్చారు. ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ముస్లింలపై జరుగుతున్న అన్యాయాలపై చర్చించుకునేవారు. డాక్టర్ ఇస్రార్ అహ్మద్, జకీర్ నాయక్, షేక్ యాకూబ్ జమాలీ, షేక్ జావెద్ రబ్బానీ ప్రసంగాలతో వీరు ప్రేరణ పొందినట్టు ఎఫ్ఐఆర్‌లో వివరించారు. ముస్లిమేతరుల చేతిలో ముస్లిం మహిళలు మోసపోకుండా రక్షించేలా ఏహెచ్ఐఎం (అల్-హింద్ ఇత్తెహదుల్ ముస్లిమీన్) పేరుతో గ్రూపులు ఏర్పాటు చేసి, అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా గత ఏడాది నవంబర్ 22న ముంబై వెళ్లి ఓ పదిమందిని కలిశారని, అద్నాన్ ఖురేషీ, దిల్షాన్, మొహిసిన్ షేక్, జహీర్ అలియాస్ అమన్‌తో కలిసి ఓ లైవ్ షోకు వీరు హాజరయ్యారని పోలీసులు తెలిపారు.

ఓన్లీ 'సిగ్నల్' కాల్స్..

వీరంతా బీహార్‌కు చెందిన అబూతలయం అలియాస్ అబూ ముసబ్ సూచనల మేరకు సిగ్నల్ యాప్‌లో తరచూ మాట్లాడుకునే వారని పోలీసులు తెలిపారు. జిహాదీ వైపు ఆకర్షితులైన వీరంతా తక్కువ ఖర్చుతో పేలుడు పదార్థాలు తయారు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. యువతను మతోన్మాదం వైపు మరల్చడానికి అవసరమైతే ప్రాణత్యాగం చేయాలని సిరాజ్, సమీర్ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు.

ఎన్ఐఏకు ఉగ్ర కుట్ర కేసు..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో భారీగా ఆత్మాహుతి దాడులకు కుట్ర చేసిన సిరాజ్, సమీర్‌ను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అదుపులోకి తీసుకోనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ కేసులో వారిని విచారించేందుకు ఎన్ఐఏ ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలిసింది. కేసు తీవ్రత దృష్ట్యా విజయనగరం పోలీసులు సైతం ఎన్ఐఏకు కేసును అప్పగించేందుకు అంగీకరించిందని సమాచారం. ఇప్పటికే విశాఖ కేంద్ర కారాగారంలో వీరిద్దరినీ పలు కోణాల్లో ప్రశ్నించనున్నారు. దేశవ్యాప్తంగా వీరు పేలుళ్లకు కుట్ర చేశారా? ఎవరెవరిని కలిశారు? వీరికి ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? వారికి నిధులు సమకూర్చింది ఎవరు? ఆయా బ్యాంకు ఖాతాల వివరాలు వంటి అంశాలపై దృష్టి సారించారు. మొదటిరోజు పూర్తి సమాచారాన్ని సేకరించిన ఎన్ఐఏ.. రిమాండ్‌లో ఉన్నవారిని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకునేందుకు అవసరమైన కోర్టు ప్రొసీడింగ్స్ పూర్తి చేసినట్టు సమాచారం.

రైతులపై సైబర్ నేరగాళ్ల గురి

- **'పీఎం కిసాన్' పథకమే లక్ష్యం**
- **'పీఎం కిషాన్' పేరిట ఏపీకే ఫైల్**
- **క్లిక్ చేసి, రిజిస్టరైతే ఫోన్ హ్యాక్**
- **అన్‌బ్లాకింగ్‌కు డబ్బులు డిమాండ్**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు.. ఇప్పుడు రైతులకు వల విసురుతున్నారు. 'ప్రధాన మంత్రి కిసాన్ యోజన' పథకాన్ని లక్ష్యంగా చేసుకుని అన్నదాతలను కొల్లగొట్టేందుకు సిద్ధమవుతున్నారు. వాట్సాప్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా 'PM Kisan Yojana'కు బదులుగా 'PM KISHAN YOJANA.apk' పేరిట మాల్‌వేర్‌తో కూడిన ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ (ఏపీకే) ఫైల్‌ను పంపుతున్నారు. దాన్ని ఓపెన్ చేసి, యూనిక్ ఐడీ కోసం రిజిస్ట్రేషన్ చేయగానే మొబైల్ ఫోన్ హ్యాకింగ్‌కు గురవుతున్నది. ఫోన్‌ను రీస్టార్ట్ చేసినప్పటికీ వాట్సాప్ హ్యాంగ్ అయింది. అప్పటికే ఆ ఫోన్‌లోని వాట్సాప్ కాంటాక్ట్స్ అనుమతి లేకుండానే ఇతరులకు షేర్ అవుతున్నాయి. మంగళవారం ఓ మిత్రుడు ఫార్వర్డ్ చేసిన 'PM KISHAN YOJANA.apk' ఫైల్‌ను యువరైతు గాంధీ ఓపెన్ చేయడంతో ఆ ఫోన్ హ్యాక్ అయింది. అలా వారం రోజుల్లో తెలంగాణలో పలువురు రైతుల ఫోన్లను సైబర్ మోసగాళ్లు హ్యాక్ చేసి డబ్బులు కొల్లగొట్టినట్టు సమాచారం. apk, .exe, .pif లాంటి ఎక్స్‌టెన్షన్లతో ముగిసే లింకులను ఓపెన్ చేయొద్దని, వాటిని మరొకరికి ఫార్వర్డ్ చేసేముందు ఆలోచించుకోవాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు హెచ్చరిస్తున్నారు.

మెడికోల స్టైపెండ్‌పై సర్కారులో కదలిక

హైదరాబాద్, మే 19 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు మెడికల్ కళాశాలల (యూజీ ఇంటర్న్‌షిప్, పీజీ) విద్యార్థుల స్టైపెండ్ అంశానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ అంశాన్ని ఎన్ఎంసీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తామని డీఎంఈ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఇంటర్న్స్, పీజీ విద్యార్థుల బృందం ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో స్టైపెండ్ సమస్యను వైద్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టీజీఎంసీ కార్యాలయంలో చైర్మన్ డా.మహేష్, డీఎంఈ, తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ (టీఏఎఫ్ఆర్సీ) చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు స్పందిస్తూ స్టైపెండ్ ఫీజు, అక్రమ ఇన్‌స్టంట్ ఫీజు వసూలుపై ప్రైవేటు కాలేజీలకు నోటీసులు జారీ చేస్తామని విద్యార్థులకు తెలిపారు. రెండు మూడు రోజుల్లో ప్రిన్సిపాళ్లు, డీన్‌లకు అధికారిక నోటీసులు పంపించనున్నట్టు తెలిపారు. ఆరోగ్య శాఖ మంత్రిని సైతం విద్యార్థుల బృందం కలవగా స్టైపెండ్ విషయమై ఇప్పటికే ప్రైవేటు కాలేజీ మేనేజ్‌మెంట్‌లను హెచ్చరించినట్టు తెలిపారు. శనివారం ఎన్ఎంసీ చైర్మన్‌తో ఈ విషయమై చర్చిస్తామని హామీ ఇచ్చినట్టు విద్యార్థులు తెలిపారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ 'మెడికోల స్టైపెండ్ పోరు' పేరిట ఆదివారం కథనం ప్రచురితమైంది. దీంతో వైద్య, ఆరోగ్య శాఖలో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశం కాగా వెంటనే సమస్య పరిష్కరిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారులు వైద్య విద్యార్థులకు హామీ ఇచ్చారు.

వైద్యులపై దాడులు చేస్తే చర్యలు తీసుకోవాలి

వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినాకు వినతి

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): వైద్యులపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ద్వారకనాథ రెడ్డి, సెక్రటరీలు వీ అశోక్, టీ దయాల్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. దవాఖానల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్ కోసం సింగిల్‌విండో క్లియరెన్స్‌లు ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. అర్హత లేకున్నా వైద్యం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ట్రేడ్ లైసెన్స్ పేరిట దవాఖానలపై వేధింపులు ఆపాలని డిమాండ్‌చేశారు. వైద్య కళాశాలలు పెరిగినందున యువ వైద్యుల్లో నిరుద్యోగం పెరుగుతున్నదని.. ఉద్యోగ నోటిఫికేషన్లను పారదర్శకంగా చేపట్టి.. వెంటనే నియామక ప్రక్రియ చేపట్టాలని వారు కోరారు.

ఆడపులి చర్మం స్వాధీనం

- **అటవీ శాఖ అధికారుల అదుపులో నలుగురు నిందితులు**
- **వివరాలు వెల్లడించిన కాగజ్‌నగర్ డివిజన్ ఫారెస్ట్ అధికారులు**

కాగజ్‌నగర్, మే 20 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్‌లోని పెంచికలపేట్ మండలం ఎల్లూర్ అటవీ ప్రాంతంలో వేటగాళ్ల ఉచ్చుకు బలైన ఆడపులి చర్మం, గోర్లు, దవడలు స్వాధీనం చేసుకున్నట్టు డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, ఎఫ్‌డీపీటీ శాంతారాం తెలిపారు. మంగళవారం కాగజ్‌నగర్ అటవీ డివిజన్ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 13న బెజ్జూర్ మండల అటవీ ప్రాంతంలోకి వచ్చిన ఆడపులి పెంచికలపేట్ అటవీ ప్రాంతంలో పులి వేటగాళ్లు అమర్చిన కరెంట్ తీగలకు తగిలి ఈ నెల 14న మృత్యువాత పడిందని తెలిపారు. బెల్లంపల్లి కాగజ్‌నగర్ డివిజన్‌కు చెందిన అటవీ, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో విచారణ చేపట్టి నిందితులను గుర్తించి విచారిస్తున్నట్టు వెల్లడించారు. దహెగాం మండలం చిన్నరాస్పల్లికి చెందిన శేఖర్ ఇంటి ఆవరణలో బాక్సుల్లో దాచిపెట్టిన పులి చర్మం, గోర్లు, దవడలు తదితర అవశేషాలతో పాటు వేటకు ఉపయోగించిన కరెంట్ తీగ, బైక్, కత్తులు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కొద్దిరోజుల క్రితం సిర్పూర్ మండలం ఇటిక్యాలపహాడ్ అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలను గుర్తించామని, ప్రస్తుతం కారిడార్‌లో ఎన్ని పులులు ఉన్నాయని స్పష్టం చేయలేమని తెలిపారు.

కరోనాతో భయం వద్దు

- **ఎలాంటి వేవ్‌కు చాన్స్ లేదు**
- **కొంతమంది అలర్ట్‌గా ఉండాలి**
- **హెల్త్ డైరెక్టర్ రవీందర్ సూచన**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): తాజాగా విస్తరిస్తున్న కరోనాతో భయపడాల్సిన అవసరం లేదని హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర నాయక్ పేర్కొన్నారు. ప్రస్తుతం కరోనా ఎండమిక్ (విలక్షణ) దశలో ఉన్నదని, కేసులు పెరిగినా, సునాయాసంగా నియంత్రించవచ్చని చెప్పారు. ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఎండమిక్ స్టేజ్‌లో అక్కడక్కడ కేసులు పెరిగే అవకాశం ఉన్నదని అన్నారు. సాధారణ దగ్గు, జలుబు లక్షణాలతోనే ఇది వస్తుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎలాంటి వేవ్ రాదని స్పష్టంచేశారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఉంటే మాస్క్ ధరించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తామన్నారు. ఇప్పటికే అన్ని జిల్లాలను అప్రమత్తం చేశామని చెప్పారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిబ్బంది సిద్ధంగా ఉన్నారని భరోసా కల్పించారు. గతంలో కరోనా వేవ్‌లో పనిచేసిన అనుభవం ఉన్న వైద్యులు, సిబ్బంది రాష్ట్రంలో ఉన్నారని గుర్తుచేశారు. సాధారణ లక్షణాలు ఉన్నోళ్లకు సింప్టమాటిక్ ట్రీట్మెంట్ ఇస్తే సరిపోతుందన్నారు. భయపడాల్సిన అవసరం లేదని, జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని వివరించారు.

గనులశాఖ ఎండీ సుశీల్‌కుమార్ బదిలీ

- **ఆయన స్థానంలో భవేశ్‌మిశ్రాకు బాధ్యతలు**
- **ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): టీజీఎండీసీ ఎండీ బీఆర్‌వీ సుశీల్‌కుమార్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ (ఐటీఈసీ)శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రాకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సుశీల్‌కుమార్‌ను గనులశాఖ ఓఎస్డీగా నియమించింది. గనులశాఖకు చెందిన విశ్రాంత అధికారి సుశీల్‌కుమార్‌ను నిరుడు అక్టోబర్‌లో టీజీఎండీసీ ఎండీగా ప్రభుత్వం నియమించింది. రెండేండ్లపాటు ఆయన ఎండీగా కొనసాగాల్సి ఉన్నప్పటికీ.. అకస్మాత్తుగా బదిలీ చేయడం గమనార్హం. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేవరకు ఆయన్ను ఓఎస్డీగా కొనసాగించనున్నట్టు స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఇసుక సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో తాజాగా ఎండీని బదిలీ చేయడం విశేషం.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు



అస్వస్థతకు గురైన వృద్ధుడిని అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తున్న వైద్య సిబ్బంది

కాళేశ్వరంలో భక్తుల రద్దీ

- **సరస్వతీ పుష్కర విధుల్లో పారిశుధ్య కార్మికుడి మృతి**
- **మరొక భక్తుడికి అస్వస్థత**
- **వసతుల లేమితో ఇబ్బందులు**

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 20 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆరో రోజు మంగళవారం త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకొన్నారు. రద్దీకి అనుగుణంగా అధికారులు వసతులు కల్పించకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సరస్వతీ పుష్కరాల్లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న గంగారం గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు మంతెన శ్రీనివాస్ వడదెబ్బతో మృతి చెందాడు. మృతదేహాన్ని ధర్మసమాజ్ పార్టీ భూపాలపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించేందుకు వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణమూర్తి(66) ఎండ వేడిమికి తాళలేక అస్వస్థతకు గురయ్యాడు. అంబులెన్స్‌లో దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఏర్పాట్లు సరిగా లేక ఇబ్బంది పడుతున్నాం

సరస్వతీ పుష్కరాల్లో అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదు. సరస్వతీ ఘాట్ వద్ద ఇసుకపై నడిచేందుకు మ్యాట్ ఏర్పాటు చేయకపోవడంతో ఎండ తీవ్రతకు ఇబ్బంది పడ్డాం. సామాన్య భక్తులను అధికారులు పట్టించుకోవడంలేదు. చలువ పందిళ్లు సరిపడా లేవు.

- సతీశ్ కుమార్, భక్తుడు, జయశంకర్ భూపాలపల్లి

రెండేండ్లలో 78,114 ఫోన్ల రికవరీ

దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ

హైదరాబాద్, మే 20 (నమస్తే తెలంగాణ): చోరీకి గురైన/పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేయడంలో తెలంగాణ పోలీసులు మరోసారి దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. గత రెండేండ్లలో 78,114 ఫోన్లను రికవరీ చేసి ప్రశంసలు అందుకున్నారు. వాటిలో అత్యధికంగా 11,879 ఫోన్లను హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో, 10,385 మొబైల్స్‌ను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో, 8,681 ఫోన్లను రాచకొండ పరిధిలో బాధితులకు అప్పగించారు. కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఈశాన్య రాష్ట్రాల్లో 2022 సెప్టెంబర్ 5న ప్రయోగాత్మకంగా ప్రారంభమైన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ సేవలు తెలంగాణలో 2023 మే 19 నుంచి అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్రంలో సీఈఐఆర్ పోర్టల్ సేవలు 227 రోజులు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ మొబైల్ ఫోన్ల రికవరీలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకోవడం విశేషం. ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించిన సీఐడీ విభాగాన్ని డీజీ శిఖా గోయెల్‌ను, సైబర్‌క్రైం ఎస్పీ బీ గంగారాం బృందాన్ని డీజీపీ జితేందర్ అభినందించారు.

రంగాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- **లారీని బలంగా ఢీకొట్టిన ప్రైవేటు బస్సు**
- **నలుగురు దుర్మరణం, 31 మందికి గాయాలు**

ప్రమాదానికి కారణమైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

పరిగి, మే 20 : వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ వద్ద హైదరాబాద్- బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ట్రావెల్ బస్సు వెనుక నుంచి వేగంగా ఢీకొనడంతో బస్సులో ఉన్న వారిలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరో 31 మందికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా.. పరిగికి చెందిన అమ్మాయికి షాబాద్ మండలం చందనవెల్లికి చెందిన అబ్బాయితో ఈనెల 16న వివాహం జరిగింది. సోమవారం రాత్రి పరిగిలోని అమ్మాయి వారి ఇంట్లో విందు ఉండగా అబ్బాయి కుటుంబసభ్యులు, బంధువులు ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో వెళ్లారు. రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. 1.40 గంటలప్పుడు రంగాపూర్ స్టేజీ దాటిన తర్వాత జాతీయ రహదారిపై ఉన్న సిమెంట్ లోడ్ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అతివేగంగా వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో షాబాద్ మండలం చిన్న సోలిపేటకు చెందిన బాలమణి (60), సీతారాంపూర్ వాసి ముత్యాల మల్లేశ్ (26), ఫరూక్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన మంగళి సందీప్(28), చేవెళ్ల మండలం రావులపల్లివాసి హేమలత(30) మరణించారు. మరో 31 మందికి గాయాలు కాగా వారిలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సులో ఇరుక్కున్న పలువురిని పోలీసులు కష్టపడి బయటకు తీశారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంపై పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కన్న కూతురిని చంపిన తల్లి

- **ఐదు నెలల క్రితం భర్తను హత్య చేసిన ఎల్లమ్మ**
- **నాగర్‌కర్నూల్ జిల్లాలో ఘటన**

మేకల నవిత(ఫైల్)

లింగాల, మే 20 : ఓ తల్లి తన కూతురిని నీటిసంపులో పడేసి చంపిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం చెన్నంపల్లిలో చోటు చేసుకున్నది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నంపల్లికి చెందిన మేకల రాములు, ఎల్లమ్మ దంపతుల రెండో కూతురు మేకల నవిత(6). సోమవారం అర్ధరాత్రి బాలిక నిద్రలో ఉండగా తల్లి ఎత్తుకొని వెళ్లి ఇంటిపక్కనే ఉన్న నీటి సంపులో పడేసింది. గమనించిన బాలిక చిన్నాన్న వెంటనే సంపులో నుంచి చిన్నారిని బయటకు తీయగా అప్పటికే మృతిచెందింది. ఎల్లమ్మ ఐదు నెలల క్రితం భర్తను హత్య చేసి జైలుకు వెళ్లి, రెండు నెలల క్రితం బెయిల్‌పై వచ్చింది. మృతురాలి నానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వెల్లడించారు.

కశ్మీర్‌లో నర్సంపేట సైనికుడు మృతి

మూడు రోజులకు స్వగ్రామానికి చేరిన మృతదేహం

నాగరాజు (ఫైల్)

వరంగల్ జిల్లా నర్సంపేటలో జవాన్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

నర్సంపేట, మే 20 : జమ్మూకశ్మీర్‌లో నర్సంపేటకు చెందిన ఆర్మీ జవాన్ ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు రోజుల తర్వాత స్వగ్రామమైన వరంగల్ జిల్లా నర్సంపేటకు అతడి మృతదేహం చేరుకోగా, అశ్రునయనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణం సర్వాపురం 4వ వార్డుకు చెందిన సంపంగి మల్లయ్య-విజయ దంపతులకు ముగ్గురు సంతానం. చిన్న కుమారుడు నాగరాజు(28) 2016లో ఆర్మీ జవాన్‌గా ఎంపికయ్యాడు. మూడేళ్లుగా జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతం సాంబ సెక్టార్‌లో బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నాడు. మార్చిలో సెలవుపై నర్సంపేటకు వచ్చి తల్లిదండ్రులతో గడిపాడు. ఆర్మీ ఉన్నతాధికారుల పిలుపుమేరకు ఏప్రిల్ 23న విధుల్లో చేరాడు. అప్పటినుంచి నిత్యం తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈ క్రమంలోనే మానసిక ఆందోళనకు గురైన నాగరాజు ఆదివారం బెటాలియన్‌లో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

12నెలల వ్యవధిలోనే అన్నదమ్ములు..

గడిచిన 12 నెలల వ్యవధిలోనే ఇదే కుటుంబం నుంచి అన్నదమ్ములు మృతి చెందారు. ఆర్మీ జవాన్ నాగరాజు అన్నయ్య వెంకటేశ్ ఏడాది క్రితం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అన్నదమ్ముల మృతి ఆ కుటుంబ సభ్యులను తీవ్రంగా కలచివేసింది. వృద్ధులైన తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా నిలవాలని స్థానికులు కోరుతున్నారు.